హోమియో.. లేదయో!



శిథిలావస్థకు చేరిన ఆసుపత్రి వద్ద వైద్యుడు చంద్రశేఖర్



పంచాయతీ కార్యాలయంలో రోగులకు వైద్యం అందజేస్తున్న దృశ్యం

- ఉప్పుటూరు హోమియో వైద్యశాలకు మోక్షమెప్పుడో..
- శిథిలావస్థకు చేరిన గ్రామ వైద్యశాల

పర్చూరు (చినగంజాం): ఉప్పుటూరు హోమియో వైద్యశాల శిథిలావస్థకు చేరింది. ఆసుపత్రి మూత పడి సుమారు నాలుగు సంవత్సరాలైంది. దీంతో ఆసుపత్రి ప్రాంగణమంతా పిచ్చి చెట్లు మొలిచి భయానకంగా మారింది. ఆసుపత్రి ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. గడచిన నాలుగేళ్ళ నుంచి ఆసుపత్రి తెరవక పోవడంతో లక్షల రూపాయలు విలువ చేసే మందులు పనికి రాకుండా పోయాయి. గత ఏడాది అక్టోబర్‌లో ఆస్పత్రి దుస్థితిపై సాక్షి జిల్లా పేజీలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు నెల రోజుల క్రితం వైద్యుడిని ఏర్పాటు చేశారు.

ఆసుపత్రి దుస్థితి ఇలా..

ఉప్పుటూరు హోమియో వైద్యశాలలో విధులు నిర్వహించేందుకు వచ్చిన వైద్యుడు దాసరి చంద్రశేఖర్ హోమియో వైద్యశాల దుస్థితిని చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. ముళ్ళ చెట్లు, ఖాళీ మద్యం సీసాలతో నిండి ఉన్న ఆసుపత్రి పరిస్థితులను చూసి బిత్తర పోయారు. తాను పనిచేయాల్సింది ఇటువంటి పరిస్థితుల నడుమా అని గ్రామస్తులతో వాపోయారు. ఆసుపత్రి లోనికి వెళ్ళేందుకు వీలు లేక పోవడంతో దుస్థితి గురించి జిల్లా ఆయుష్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

పంచాయతీ కార్యాలయంలోనే వైద్యం

ప్రస్తుతం గ్రామ సర్పంచ్ సహకారంతో పంచాయతీ కార్యాలయంలోని ఓ చిన్నగదిని తీసుకొని ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. చీరాల ప్రభుత్వ వైద్యశాల మందులు తెచ్చి పెట్టుకొని వైద్యాన్ని కొనసాగిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన హోమియో వైద్యశాలను తొలగించి దాని స్థానంలో కొత్త వైద్యశాల భవనాన్ని నిర్మించాలని, దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై హోమియో వైద్యుడు దాసరి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ప్రస్తుతం హోమియో వైద్యాన్ని పంచాయతీ కార్యాలయంలో ఉండి అందజేస్తున్నామని, ఆసుపత్రి భవనం పరిస్థితిని గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఆసుపత్రి భవనం శిథిలం కావడం వలన దాని స్థానంలో భవనాన్ని ఏర్పాటు చేస్తే తిరిగి యథావిధిగా కొనసాగించవచ్చని చెప్పారు.

సమాజ హిత నాటకం చింతామణి

- వేశ్యా సాంగత్యంతో చెడిన వారి జీవితాలే నాటక ఇతివృత్తం



రంగస్థల నటులను సన్మానిస్తున్న సృజన సభ్యులు

అద్దంకి: వేశ్యా సాంగత్యంతో సర్వం కోల్పోయిన వారి జీవితాలను సమాజానికి కళ్లకు కట్టినట్లు చూపించే సమాజ హిత నాటకమే చింతామణి అని సాహితీవేత్త (కంభం) శశికుమార్ అన్నారు. చింతామణి సమాజ హితమైన నాటకమన్నారు. సృజన సాహిత్య సంఘ ఆధ్వర్యంలో డాక్టర్ యు. దేవపాలన అధ్యక్షతన కాళికా సమేత కమలేశ్వర ఆలయంలో ఆదివారం సాహిత్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాహితీవేత్త పాపిశెట్టి శశికుమార్ హాజరయ్యారు. పీసీహెచ్ కోటయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో వక్తలు చింతామణి ప్రసంగించారు. పట్టణంలో చెందిన పేరుగాంచిన రంగస్థల నటులు మిద్దెబోయిన అంజనేయులు, తన్నీరు నాగేశ్వరరావు, ఆలకుంట శ్రీనివాసరావు, గోవాడ శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు. సాహితీవేత్త శశికుమార్ మాట్లాడుతూ వంద సంవత్సరాల క్రితమే పరస్త్రీ వ్యామోహంతో సర్వం కోల్పోయిన మూడు పాత్రలను చింతామణి ద్వారా రచయిత కాళ్లకూరి వివరంగా చూపించాడని చెప్పారు. స్థానిక రంగస్థల నటులు గురించి లక్కరాజు శ్రీనివాసరావు, ఎండీ రఫీ, గాడేపల్లి దివాకరదత్తు సవివరంగా సభికులకు వివరించారు. దానిలో భాగంగా హరిశ్చంద్ర పాత్రతో పేరుగాంచిన మిద్దెబోయిన కొన్నిపద్యాలను పాడి వినిపించారు. సుబ్బిశెట్టి పాత్రకు పేరుగాంచిన ఆలకుంట శ్రీనివాసరావు, శ్రీహరి పాత్రకు వన్నె తెచ్చిన నాగేశ్వరరావు, అద్దంకి మాణిక్యారావు మనవడిగా పేరు ప్రఖ్యాతులు పొందిన గోవాడ శ్రీకాంత్ తమ పాత్రల డైలాగులను, పద్యాలను సభికులకు వినిపించి అలరించారు. మొత్తం మీద సభలోని వారు ఆయా పాత్రధారుల సంభాషణలు, పద్యాలతో ఆయా పాత్రలు అక్కడ సజీవంగా ఉన్నట్లు భావించారు. ముఖ్యంగా చింతామణిలో మోడరన్ సుబ్బారావు పాత్ర డైలాగులు, గోవాడ శ్రీకాంత్ రాగాల వివరణ, శ్రీహరి డైలాగులు, నాగేశ్వరావు చెప్పిన శ్రీహరి డైలాగులు, మొద్దెబోయిన పాడిన పద్యాలు సభికులను మంత్ర ముగ్ధులను చేశాయి. తరువాత రంగస్థల నటులను సృజన ఆధ్వర్యంలో వీరవల్లి సుబ్బారావు సభ్యులు ఘనంగా సన్మానించారు. గోవాడ శ్రీఖాంత్‌కు గాన గంధర్వ అనే బిరుతో సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, నాటకాభిమానులు పాల్గొన్నారు.

తీరంలో సండే సందడి



వాడరేవు తీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారింది. వివిధ గ్రామాల ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి చేరుకున్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానమాచరించి ఆనందోత్సాహాలతో సందడి చేశారు. తీరం ఒడ్డున యువకులు సేదతీరుతూ సముద్రపు మన్నుతో ఆటలాడుతూ కడలి చెంత సంతోషంగా గడిపారు. చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలతో పాటు పల్నాడు జిల్లాలోని పలుప్రాంతాలు, గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటుగా తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెదిన ప్రజలు తమ కుటుంబ సభ్యులతో వాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్లకు గాయాలు

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్ల గాయపడిన సంఘటన ఆదివారం సాయంత్రం మార్టూరులో జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి. యద్దన పూడి ఎస్సీ కాలనీకి చెందిన పల్లె పోగు వీరయ్య తమ కుమార్తె ప్రైజీతో పాటు టీవీఎస్ మోపెడ్ వాహనంపై ఆదివారం సాయంత్రం మార్టూరు వచ్చారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వీరి వాహనాన్ని ఓ లారీ ఢీ కొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై పడి గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముక్కు వద్ద రక్తస్రావం అధికంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం వీరిని గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

శింగరకొండ దేవస్థానానికి వంట పాత్రల వితరణ



వంటపాత్రలు అందజేస్తున్న దాతలు

అద్దంకి రూరల్:

ప్రముఖ పుణ్యక్షేత్రమై శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానానికి ఆదివారం దాతలు వంటపాత్రలు అందజేశారు. నరసరావుపేట మండలం రావిపాడు గ్రామానికి చెందిన మల్లవరపు శరభయ్య, అన్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తె మనుమడు రూ. 50 వేలు విలువ కలిగిన వంటపాత్రలను అందజేసినట్లు దేవస్థాన ఏసీ తిమ్మనాయుడుకు తెలిపారు.

ఉల్లాసంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పూర్వ విద్యార్థులు, నాటి గురువులు

బల్లికురవ: మండలంలో ఐదు దశాబ్దాలక్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు 50 మంది ఆదివారం ఒక్కటయ్యారు. కొండాయపాలెం గ్రామంలోని చెక్కెర ఫౌండేషన్ కన్వెన్షన్ హాలు వేదిక అయింది. 1968–71 సంవత్సరాల మధ్య డిగ్రీ బీకాం చదువుకున్న పల్నాడు జిల్లా గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో డిగ్రీ బీకాం మొదటి బ్యాచ్ రెండు సెక్షన్‌లతో 120 మంది వరకు విద్యార్థులు ఉండేవారు. కక్కెర ఫౌండేషన్ నిర్వాహకులు కక్కెర ఆంజనేయులు, గరికపాటి వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో జరిగింది. రామాలయంలో అర్చకుడు వి. మారుతి నరేష్‌చే విశిష్ట పూజలు, వేద ఆశీర్వచనాలు అందించారు. ఆనాటి గురువు.. ప్రస్తుత పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, చంద్రశేఖరరావు, భాస్కర్‌రెడ్డిలను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.



పూర్వవిద్యార్థులతో అధ్యాపకులు

చదవడం అలవాటు చేసుకోండి



లైబ్రరీలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): విద్యార్థులు పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని సంతమాగులూరు లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శాఖ గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యారుథ్దులతో కథల పుస్తకాలు చదివించారు. 19 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబ దేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు.

క్లుప్తంగా

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బల్లికురవ: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో 1,2లు వస్త్రం నాయక్, రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. అద్దంకి మండలంలోని మైలవరం ఉన్నత పాఠశాల నుంచి మొత్తం 483 మంది ఈనెల17 నుంచి 31వరకు జరిగే పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. బల్లికురవ, పెద అంబడిపూడి, వైదన, ఉన్నత పాఠశాలల పరీక్ష కేంద్రాల్లో జంబ్లింగ్ విధానంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయని అరగంట ముందు హాల్ టికెట్‌తో విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాలన్నారు. బల్లికురవలో 146 మంది, పెదఅంబడిపూడిలో 96 మంది, వైదనలో 241 మంది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు.

ప్రత్యేక అలంకరణలో ఈర్ల గంగమ్మ



అలంకరణలో ఈర్ల గంగమ్మ

బల్లికురవ: పాల్గుణ మాసం దశమి ఆదివారం సందర్భంగా నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్లగంగమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పడమర భాగంలో ఈర్లకొండకు దిగువ భాగంలో స్వయంభుగా వెలసిన ఈర్ల గంగమ్మ భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతోంది.

11 నుంచి బ్రహ్మోత్సవాలు




బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న వెంకటేశ్వరస్వామివారి ఆలయం

కారంచేడు: వాడరేవు–పిడుగురాళ్ళ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న శ్రీ భూసమేత వెంకటేశ్వరస్వామి వారి 23వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

నేడు చలో గుంటూరు

మార్టూరు: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సోమవారం గుంటూరులో నిర్వహించనున్న ధర్నాకు రైతులు విరివిగా హాజరై జయప్రదం చేయాలని బాపట్ల జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామ కోటేశ్వరరావు ఆదివారం పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పాలకవర్గాల వ్యవసాయ వ్యతిరేక విధానాల కారణంగా వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు అప్పులు పాలయ్యారని, కూలి రేట్లు, వ్యవసాయ ఉపకరణాల ధరలు పెరిగి పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. స్వామినాథన్ కమిషన్‌ను అమలుపరుస్తూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలనే తదితర డిమాండ్లతో గుంటూరులోని చుట్టు గుంట వద్ద గల రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ కార్యాలయం వద్ద సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను రైతులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వీధి కుక్కల పట్టివేత



వీధి కుక్కలను తరలిస్తున్న వాహనం

చీరాల: పట్టణంలో వీధుల వెంట అధిక సంఖ్యలో సంచరిస్తున్న వీధి కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంపులుగా ఉంటూ రోడ్డుపై వెళ్లే వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది వీధి కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని నిర్వహించారు. గత రెండు రోజులుగా పట్టణంలో సంచరిస్తున్న వీధికుక్కలను పట్టుకుంటున్నారు. రెండు రోజులుగా 50 కుక్కలను పట్టుకున్నారు. వీటిని ఒంగోలుకు తరలించి అక్కడ యాంటీ రాబీస్ వ్యాక్సిన్లు వేయడంతో పాటు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి తిరిగి వదిలిపెట్టనున్నారు. వీధుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు కొన్సిలర్లు కౌన్సిల్ సమావేశాలలో పేర్కొన్నారు. దీంతో వీధికుక్కల వలన ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.




ప్రాసంగులపాడు ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న మురుగు కాలువల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు

ఇలా నిర్మిస్తే ఎలా?

- మురుగు కాలువల్లోనే విద్యుత్ స్తంభాలు
- స్థానికులు వద్దన్నా వినని కాంట్రాక్టర్

మేదరమెట్ల: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మేలు చేయకపోగా నష్టం చేకూరుస్తున్నారు. నూతనంగా నిర్మించే మురుగు కాలువలను విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే సంబంధిత కాంట్రాక్టర్ నిర్మిస్తున్నాడు. అధికారులు కూడా తమకు పట్టనట్లుగా చోద్యం చూస్తున్నారు. కొరిశపాడు మండలంలోని ప్రాసంగులపాడు ఎస్సీ కాలనీలో ఇటీవల మంజూరైన రూ.20 లక్షలతో కాలనీలోని అన్ని వీధుల్లో మురుగు కాలువలు నిర్మించేందుకు పనులు చేపట్టారు. కాగా నూతనంగా నిర్మించే మురుగు కాలువల్లో విద్యుత్ స్తంభాలు అలాగే ఉండటం వల్ల మురుగు నీరు సాఫీగా ముందుకు సాగదని దీంతో కాలువల్లో మురుగు నిండిపోయి ఇళ్ల మధ్యకు వస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మురుగు ముందుకు సాగదని స్థానికులు సంబంధిత కాంట్రాక్టర్‌కు తెలియపరచినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికే నిర్మించిన సైడు కాలువల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చిక్కీల వ్యవహారంపై విచారణ



చినగంజాంలో మాట్లాడుతున్న చీరాల డిప్యూటీ ఈఓ గంగాధర్, ఎంఈఓ అజయ్‌బాబు



స్టడీ అవర్‌లో విద్యార్థులు

సాక్షి ఎఫెక్ట్..

చినగంజాం: "ఉన్నత సంకల్పానికి పాతర" అనే శీర్షికన ఆదివారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖాధికారులు స్పందించారు. చీరాల డిప్యూటీ ఈఓ డి. గంగాధర్, చినగంజాం మండల విద్యాశాఖాధికారి బొల్లిముంత అజయ్‌బాబులు ఆదివారం మండలంలోని ఉన్నత పాఠశాలలను సందర్శించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చినగంజాం, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. మండలంలోని అడివీధిపాలెం, రాజుబంగారుపాలెం, పెదగంజాం, పల్లెపాలెం ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఇన్‌చార్జ్‌లతో మాట్లాడి వివరణ కోరగా తమ పాఠశాలల పరిధిలో చిక్కిలు బయటపడవేసిన సంఘటనలు చోటు చేసుకోలేదని చెప్పారు. తమకు తెలియకుండా విద్యార్థులు వృథా చేస్తుంటే.. తప్పనిసరిగా తినే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చిక్కిల్లోని పోషక విలువలు, ప్రయోజనాలు వివరిస్తామని తెలియజేశారు.

పదో తరగతి స్టడీ అవర్స్ పరిశీలన

చినగంజాం, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌ను అధికారులు పరిశీలించారు. మంచి మార్కులు సాధనకై కృషి చేయాలని, పరీక్షల సమయంలో ఆరోగ్య నియమాలు పాటించాలని తెలియజేశారు. అనంతరం కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని, అమలు తీరును పరిశీలించారు. చినగంజాం ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎస్. నరసింహారావు, కడవకుదురు హెచ్‌ఎం కుర్రా రామారావు, మండలంలోని మిగిలిన ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీ సునీల్ పాల్గొన్నారు.

బాలిక సాధికారతకు రోటరీ కృషి



బాలికలకు సైకిళ్లు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చీరాల అర్బన్: బాలిక సాధికారతకు ఎప్పుడూ కృషి చేస్తున్నామని రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ 3150, 3020 గవర్నర్ చిలుకూరి శరత్‌బాబు అన్నారు. శనివారం రాత్రి స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ చిలుకూరి శరత్‌బాబు, డాక్టర్ అన్నపూర్ణ ఆర్థిక సహకారంతో రూ.3 లక్షల విలువ గల 76 సైకిళ్లను ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద బాలికలకు చీరాల రోటరీ, క్షీరపురి, వేటపాలెం రోటరీ క్లబ్ సభ్యుల ద్వారా అందించారు. బాలికలు విద్యారంగంలో విశేషంగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. సీహెచ్ బాలవెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్‌కుమార్, ఎం. శ్రీనివాసరావు, జీవై ప్రసాద్, నరేంద్రబాబు, డీవీ సురేష్, గుర్రం రాఘవరావు, మురళీకృష్ణ, శ్రీనివాసబాబు, భానుప్రసాద్, నాగమల్లేశ్వరరావు, వెంకట సురేష్, బాలికలు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం



స్వర్ణలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు, అమ్మవార్లు



స్వర్ణలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న దంపతులు

స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన అలివేలు మంగా, పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామివారి ఆలయ 49వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి స్వామివార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మీభూత జగద్గురు నృసింహానంద భారతీ మహాస్వామివారి దివ్య ఆశీస్సులతో అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లతో వెంకటేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహించారు. స్వామివార్ల కల్యాణంతో పాటు గ్రామానికి చెందిన 43 మంది దంపతులు పాలుపంపులు పొందారు. సోమవారం మునికన్యలు, మహిళలతో వేరువేరుగా కుంకుమ పూజలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నసంతర్పణను నిర్వహించారు.